నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 4 | సంచిక: 323 | శనివారం, 18 ఏప్రిల్ 2026 | పేజీలు - 8 | వెల : 3/-






## మహిళా బిల్లును అడ్డుకునే నాటకం

**ఎంపీ తేజస్వీ వ్యాఖ్యలకు బండి సంజయ్ సమర్థన**

తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించింది రేవంత్ రెడ్డే

1400 మంది బలిదానాలకు కాంగ్రెస్ కారణం

రాష్ట విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని, ఇందులో తప్పేముందని అన్నారు కేంద్రమంత్రి బండి సంజయ్. ఢిల్లీలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు తప్పుబడుతున్నారంటూ ఫైర్ అయ్యారు.

5



## అడ్డుకుంటే చరిత్ర హీనులే

**కాంగ్రెస్‌కు కిషన్ రెడ్డి వార్నింగ్**

ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడంలో విపక్షాలు

మహిళా వ్యతిరేక పార్టీలుగా కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్

మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని విమర్శించారు.

5



## ఆర్టిజన్ల సమ్మె విరమిస్తున్నాం

**విద్యుత్ శాఖ ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి**

మానవీయ కోణంలో సమస్యకు పరిష్కారం

సీఎండీతో చర్చలకు ఆదేశించిన డిప్యూటీ సీఎం

ప్రజలను మెప్పించే పనులు చేయాలని ఉద్యోగులకు సూచన

ట్రాన్స్‌కో సీఎండీతో సమస్యలపై చర్చించేందుకు డిప్యూటీ సీఎం ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్‌లో ఆర్టిజన్ల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశమయ్యారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించిన డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ సాయిలు ప్రకటించారు.

వాస్తవ తెలంగాణ:

2



## సిగాచి బాధితులకు మొండి చేయి

**₹కోటి నష్ట పరిహారం ఎక్కడ?**

అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన వాగ్దానానికి మంగళం

యాజమాన్యంతో కుమ్మక్కై నష్ట పరిహారానికి తూట్లు

రేవంత్ రెడ్డిపై హరీష్ రావు ఘాటు వ్యాఖ్యలు

2



## మా వడ్లన్నీ కొనాలి

**ధాన్యం సేకరణ మరింత పెంచాలి**

30 లక్షల టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించండి

5 శాతం నూకతో బాయిల్డ్ రైస్ సరఫరాకు సిద్ధం

పాత బకాయిలు రూ.1,468.94 కోట్లు విడుదల చేయండి

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి తెలంగాణ సీఎం రిక్వెస్ట్

సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలమని కేంద్ర మంత్రికి తెలియజేశారు.

4

## కాళేశ్వరం ప్రాజెక్ట్ మరమ్మతుల పై ప్రభుత్వం కీలక నిర్ణయం..



**హైదరాబాద్ : వాస్తవ తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని కీలక బ్యారేజీల పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు, శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు భారీ కసరత్తును ప్రారంభించింది. ఇందులో భాగంగా పనుల సమన్వయం, పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల, టన్నెలింగ్ నిపుణుడు, రిటైర్డ్ ఆర్మీ అధికారి కల్నల్ పరిక్షిత్ మెహ్రా కన్వీనర్‌గా ఈ కమిటీని ఏర్పాటు చేశారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను సమన్వయం చేయడం, నిర్ణీత కాలవ్యవధిలో ప్రాజెక్టును తిరిగి వినియోగంలోకి తీసుకురావడం ఈ కమిటీ పని. వారానికి రెండుసార్లు సమావేశమై పురోగతిని ఈ కమిటీ సమీక్షిస్తుంది. ప్రతిరోజూ జరిగే పనులపై రోజువారీ పురోగతి నివేదికలను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

**మే 30వ తేదీ లోపు కసరత్తు పూర్తి..**

వర్షాకాలం ప్రారంభం కాకముందే కీలకమైన పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. బ్యారేజీల పునాదుల పటిష్టతను తెలుసుకోవడానికి మే 30వ తేదీ లోపు జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు పూర్తి చేయాలని ఆదేశించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ , నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలు, అనుమతుల మేరకు మాత్రమే ఈ మరమ్మతు పనులు సాగనున్నాయి. ముందుగా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, మేడిగడ్డను పాక్షికంగానైనా వినియోగంలోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

## బిల్లు వెనుక అసలు ఉద్దేశం వేరు: రాహుల్ గాంధీ



**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ:** పార్లమెంట్‌లో నారిశక్తి వందన్ అధినియం(చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్) బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. నారిశక్తి వందన్ అధినియం పేరుతో కేంద్రం తీసుకవచ్చిన బిల్లు వాస్తవానికి మహిళల రిజర్వేషన్‌కు సంబంధించిన బిల్లు కానేకాదని లోక్‌సభ ప్రతిపక్ష నేత అన్నారు. మహిళా బిల్లు చర్చపై ఆయన ఈ రోజు( శుక్రవారం) పార్లమెంటులో మాట్లాడారు. 2023 లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని ఇది మహిళలను అడ్డుగా పెట్టి తీసుకొచ్చిన షేమ్ ఫుల్ యాక్ట్ అన్నారు. ఈ బిల్లు వెనుక ఉన్న అసలు ఉద్దేశం కులగణన లెక్కలు లేకుండా నియోజకవర్గాల పునర్విభజన చేయాలన్నదే అన్నారు. ఓబీసీలకు 15 ఏళ్ల పాటు రిజర్వేషన్లు లేకుండా చేసే కుట్ర ఇదన్నారు. బీజేపీ సభ్యులు రాజ్యాంగం కంటే మనువాదానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉన్నతస్థాయి అధికారుల్లో , న్యాయవ్యవస్థలో ఓబీసీలు గిరిజనులు లేరని, ప్రేవేటు రంగంలో కూడా రంగంలో కూడా ఓబీసీ ఎస్సీ ఎస్టీల ప్రాధాన్యత లేదన్నారు. హిందుత్వం పేరుతో బీజేపీ పార్టీ బీసీ, ఎస్సీ,ఎస్టీలకు చేసిందేమీ లేదన్నారు.

## మాజీ రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి సీఎం నివాళి

**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ :**భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి వర్ధంతి సందర్భంగా సీఎం ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీలోని అధికారిక నివాసంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాధాకృష్ణన్ దేశానికి చేసిన సేవలను, ఆయన దేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతిగా, గొప్ప తత్వవేత్త, విద్యావేత్తగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



# సమ్మె విరమిస్తున్నాం

## విద్యుత్ శాఖ ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి

- మానవీయ కోణంలో సమస్యకు పరిష్కారం
- సీఎండీతో చర్చలకు ఆదేశించిన డిప్యూటీ సీఎం
- ప్రజలను మెప్పించే పనులు చేయాలని ఉద్యోగులకు సూచన

**వాస్తవ తెలంగాణ:** ట్రాన్స్‌కో సీఎండీతో సమస్యలపై చర్చించేందుకు డిప్యూటీ సీఎం ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్‌లో ఆర్టిజన్ల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశమయ్యారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించిన డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ సాయిలు ప్రకటించారు. కాగా, ఉద్యోగులు ప్రజలను మెప్పించే పనులు చేయాలి, సమ్మెపై బ్యాన్ ఉన్నదని తెలిసి, వేసవిలో విద్యుత్తు డిమాండ్ పీక్ స్థాయిలో ఉంటుంది. ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదని డిప్యూటీ సీఎం తెలిపారు. చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం చర్చలు చేస్తుంది, వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతుందని జేఏసీ నాయకులకు డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో పరిష్కరించ గలిగే సమస్యలపై ఆర్టిజన్ల జేఏసీతో ట్రాన్స్‌కో సీఎండీ చర్చలు జరుపుతారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు. చర్చల్లో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆర్టిజన్ల కో చైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్,



చందర్ సింగ్ ఠాకూర్, వైస్ చైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సిగాచి బాధితులకు మొండి చేయి

## కోటి నష్ట పరిహారం ఎక్కడ?

- అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన వాగ్ధానానికి మంగళం
- యాజమాన్యంతో కుమ్మక్కై నష్ట పరిహారానికి తూట్లు
- రేవంత్ రెడ్డిపై హరీష్ రావు ఘాటు వ్యాఖ్యలు



**వాస్తవ తెలంగాణ:** : ''ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. బతికున్న ప్రజలను మోసం చేయడం, మాట తప్పడం మీకు ఎలాగూ అలవాటే. కానీ కనీసం ఆ ప్రాణాలు కోల్పోయిన పేద కార్మికులను, దిక్కుతోచని స్థితిలో ఉన్న వారి కుటుంబాలను మోసం చేయకండి'' అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు అన్నారు. కార్మికుల ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులను పరిహారంగా చూపే నీచమైన కుట్రలను తక్షణమే ఆపాలన్నారు. మీరు ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

### మాట నిలబెట్టుకోలేని అసమర్థ సీఎం..

సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని హరీష్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆడుతున్న నాటకాలు అసెంబ్లీ సాక్షిగా బట్టబయలయ్యాయని హరీశ్‌రావు అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజ నర్సింహ.. మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. మాట ఇచ్చి తప్పడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందనడానికి ఈ ఘటనే నిదర్శమని వ్యాఖ్యానించారు.

# ఘట్కేసర్ సర్కిల్ నాగారం లో “''డ్రైడే ఫ్రైడే''కార్యక్రమం లో డిసి వాణి రెడ్డి..



**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం వార్డులో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏంటమాలజీ విభాగం దోమల నివారణ చర్యలను మరింత వేగవంతం చేసింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ఆదేశాల మేరకు, ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణి ప్రతి శుక్రవారం “ఫ్రైడే డ్రై డే” కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాగారం డివిజన్ పరిధిలోని అరవింద్ నగర్, దయార్కుంట ప్రాంతాలలో ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పించబడింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా దోమ గుడ్డు నుండి లార్వా దశ వరకు మరియు పెద్ద దోమగా ఎలా మారుతుందో మొబైల్ వీడియోలు, ఫ్లిప్ బుక్స్ ద్వారా ప్రత్యక్షంగా వివరించారు.ఏంటమాలజీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగిస్తూ, ప్రజలకు తగిన సూచనలు అందించారు. ముఖ్యంగా ఓవర్ హెడ్ ట్యాంకులు, డ్రమ్ములు, కూలర్లు, పాత టైర్లు, పూల కుండీలు, కొబ్బరి బొండాలు మరియు ఇతర నిరుపయోగ వస్తువులలో నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే కాలనీలు, బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలలో కాలనీ సంక్షేమ సంఘాలు, మహిళా సంఘాలు మరియు మల్కాజ్ గిరి మున్సిపాలిటీ కార్పొరేషన్ అధికారుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం జరుగుతోంది.

ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వాణి మాట్లాడుతూ,“దోమల నివారణ ప్రతి పౌరుని బాధ్యత. దోమల రహిత నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ వారానికి ఒకసారి తమ ఇళ్లలో మరియు పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి” అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో DEE-SWM I“y dt AE- బి చంద్రశేఖర్, SS, ES, WES (ఏంటమాలజీ), శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




# 12వ వార్డులో తాగునీటి సమస్యకు పరిష్కారం

## రెండు బోరుబావులను ఏర్పాటు చేసిన కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని 12వ వార్డులో రానున్న ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండడానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన 12 వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు మున్సిపల్ జెనరల్ ఫండ్ నిధులతో స్థానిక ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న ఆమె, వెంటనే స్పందించి 12 వ వార్డు నందు నూతనంగా రెండు కొత్త బోరుబావులను వేయించారు. ఈ బోరుబావి ఏర్పాటు ద్వారా వార్డు ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందుబాటులోకి రావడం జరుగుతుందని దీనితో వార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇది ఒక పెద్ద ఉపశమనంగా మారింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సదా శివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ మరియు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు పాల్గొని బోరుమోటారుకు భూమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి బోరుమోటారును స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్క్ ఇస్పెక్టర్లు ప్రసాద్, గణేష్,వార్డు ప్రజలు కర్ణం నరసింహాచారి మన్నె విజయ్ యాదవ్ మన్నె మనోహర్ నల్ల అంజమ్మ, నీలి మల్లమ్మ, మాదాసు నరేష్, మడుపతి కిరణ్, పి. ఎం. ఆర్ యువసేన నాయకులు రాగం అనిల్, గుణాకర్, అంజి గౌడ్, తాలెల్మ రాము, అఖిల్, సోమ శంకర్, మొదలగువారు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రమాదాలను నివారిద్దాం










**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాతారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో ఎన్.ఎస్.ఎస్. విభాగాల ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి పాలన ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్యశాఖ మరియు ట్రాఫిక్ పోలీస్ విభాగము సహకారంతో అరైవ్ అలైవ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం ప్రవీణ తెలిపినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య అధికారి డాక్టర్ వసంతరావు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన ప్పుడు ఆయా ప్రమాదాలకు సంబంధించి ప్రాథమిక చికిత్సలను ప్రతి ఒక్కరు తెలిసి ఉండాలని తెలిపినారు. ప్రధానంగా హార్ట్ ఎటాక్ సంభవిం చినప్పుడు సిపిఆర్ పై అవగాహన కలిగి ఉంటే ప్రాణహాని జరగకుండా వ్యక్తి ప్రాణాన్ని కాపాడ వచ్చునని తెలిపినారు .అనంతరం హార్ట్ ఎటాక్ సంభవిం చినప్పుడు సిపిఆర్ ఏ విధంగా చేయాలో ప్రాథమిక వైద్య అధికారి డాక్టర్ శశికర్ ప్రయోగ పూర్వకంగా సిపిఆర్ విధానాన్ని వివరించినారు. సి పి ఆర్ తో పాటు ఏఈడి పరికరాన్ని ఏ విధంగా ఉపయోగించాలో వివరించడం జరిగింది. అనం తరం ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన సంగారెడ్డి జిల్లా ట్రాఫిక్ సిఐ రామకృష్ణారెడ్డి మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాద చారులతోపాటు అందరూ పాటించాలని, ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు ముగ్గురు వెళ్లరాదని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, డ్రైవర్ లైసెన్స్ తో పాటు ఇన్సూరెన్స్ ని కలిగి ఉండాలని, తాగి వాహనాలను నడపరాదని, కారు వంటి వాహనాలను నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ను ధరించాలని, అన్నిటికంటే ప్రధానమైనది వాహన దారుడు డిఫెన్స్ డ్రైవింగ్ విధానాన్ని అనుసరిస్తే సగానికి పైగా ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపినారు. వాహనదారులు స్పీడ్ లిమిట్ ను పాటించాలని, ట్రాఫిక్ రూల్స్ తో పాటు తాగి వాహనాన్ని నడపరాదని, ప్రతి వ్యక్తికి ప్రాణము ఎంత విలువైనదో ఎదుటి వ్యక్తుల ప్రాణము కూడా అంతే విలువైనదని, భద్రతతో వాహనాన్ని నడిపితే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చునని తెలిపినారు. అనంతరం సంగారెడ్డి టౌన్ ఎస్ఐ నరసింహులు మాట్లాడుతూ రోడ్డు భద్రత నియ మాలను వివరంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమములో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయకుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ వల్లి సౌభాగ్యం, కళాశాల అధ్యాపక బృందము తదితరులు పాల్గొన్నారు.

## వెల్టూరు గ్రామం హిందూ సమ్మేళనం మహోత్సవం







**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెల్టూరు గ్రామంలో. గురువారము రోజున సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిర్వహించబడినది వెల్టూర్ గ్రామంలో హిందూ సమ్మేళనం నిర్వహించబడినది దీనికి వెల్టూర్. పెద్దాపూర్. ముబారక్పూర్ ఏ. ముబారక్పూర్ బి. నంది కంది. గొల్లగూడెం. శ్రీ శ్రీ శ్రీ సర్వేశ్వరంబిక. శివయోగి శివ చార్య . శ్రీ గిరి షేర్ బద్రీనాథ్ మఠం గద్వాల విచ్చేసినారు. అలాగే ముఖ్య భక్త శ్రీమతి భార్గవి కళ్యాణి ఒకటి సామూహిక గోపూజ. గణపతి హోమం. మూడు హనుమాన్ చాలీసా పారాయణం. 4 భజన సంస్కృతిక కార్యక్రమములు అంగరంగ వైభవంగా జరిగాయి ఈ యొక్క గ్రామాలనుండి హిందూ సమ్మేళనం హిందూ బంధువులు ఆయా గ్రామాల నుండి చిన్నలు పెద్దలు భారీ ఎత్తున వెల్టూరు గ్రామానికి తరలిరావడం జరిగింది. దీనికి చిన్నలు పెద్దలు యువకులు అంగరంగ వైభ వంగా సంతోషం వ్యక్తం చేయడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్దలు నాయకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాప్రా లో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమం





**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం కాప్రా మున్సిపల్ లో శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రథమపురి కెసిఆర్ కాలనీలో కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఆధ్వర్యంలో ఎంటమరాలజీ విభాగం ద్వారా శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దోమల అభివృద్ధి దోమ కాటు వలన డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా లాంటి అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రతి శుక్రవారం మన ఇంటి పరిసరాలలో పనికిరాని వస్తువుల్లో అనగా టైర్లు పూల కుండీలు కూలర్లలో ఇతరత్రా నీటి నిల్వలలో దోమల ఆరువాలను అరికట్టుటకు డ్రైడే పాటించవలసినదిగా బస్తీ వాసులకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఇంటింటికి నీటి విలువలను గుర్తించడానికి గుర్తించిన నీటిని తొలగించే కార్యక్రమం మున్సిపల్ సిబ్బంది చేశారు. మరియు రోడ్డు ఫుట్ పాత్ లను శుభ్రపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఈ సాలిబేస్ట్ మేనేజ్మెంట్ మరియు ఎండమాలజీ అధికారి రవి సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ ఎంటమాలికి విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య భద్రతనిస్తూ మెరుగైన వైద్యాన్ని అందించేది ముఖ్యమంత్రి సహాయనిధి

### ఎల్ఓసీ అందజేసిన బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు ....




**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న ముగ్గురు లబ్ధిదారులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను శుక్రవారం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన లబ్ధిదారులకు అందజేశారు. ఎల్వోసీ పత్రాల అందజేతలో భాగంగా 130 – కుత్బుల్లాపూర్ డివిజన్ లబ్ధిదారుడు రామ్ వినోద్ కుమార్ తండ్రి రామ్ గౌరీ శంకర్ కు రూ. 2,00,000/– (రెండు లక్షల రూపాయలు) మంజూరు కాగా మరొక లబ్ధిదారుడు 131 – కుత్బుల్లాపూర్ డివిజన్ కు పద్మా నగర్ కు చెందిన జి.జగన్ తండ్రి జి.కిష్టయ్యకు 1,50,000/– లక్షలు ( లక్షా యాభై వేల రూపాయలు) మంజూరు కాగా ఇంకొక లబ్ధిదారుడు జీహెచ్ఎంసీ కొంపల్లి సర్కిల్ శ్రీనివాస్ నగర్ కు చెందిన రుద్రరాజు సాయి బాబా రాజు తండ్రి ఆర్. రామచంద్ర రాజుకు రూ. 1,00,000/– (లక్షా రూపాయలు) మంజూరు కాగా మంజూరైన ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎంపీపీ సన్నా కవిత శ్రీశైలం యాదవ్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు కిషోర్ చారి, గుబ్బల లక్ష్మీనారాయణ, విజయ్, రమణారెడ్డి, వెంకట్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మా వడ్లన్నీ కొనాలి




**వాస్తవ తెలంగాణ:** యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలమని కేంద్ర మంత్రికి తెలియజేశారు. గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి జోషిని ఆయన నివాసంలో సీఎం, మంత్రి శుక్రవారం ఉదయం కలిశారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్‌ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని తెలియజేశారు. తెలంగాణలో పండే యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఈ నేపథ్యంలో యాసంగి పంటకు సంబంధించిమొత్తం 30 ఎల్‌ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్‌ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి చేసిన ప్రతిపాదనకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. కాగా, 201415 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన ₹1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**ధాన్యం సేకరణ మరింత పెంచాలి**

- 30 లక్షల టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించండి
- 5% నూకతో బాయిల్డ్ రైస్ సరఫరాకు సిద్ధం
- పాత బకాయిలు రూ.1,468.94 కోట్లు విడుదల చేయండి
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి తెలంగాణ సీఎం రిక్వెస్ట్
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

# యువత ఉన్నత లక్ష్యాలను నిర్ణయించుకొని ముందుకు సాగాలి




**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాతారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో క్యారీర్ గైడెన్స్ సెల్, కామర్స్ విభాగము మరియు ఎన్.ఎస్.ఎస్. విభాగాల ఆధ్వర్యంలో సోలాపూర్ కు చెందిన స్వచ్ఛంద సంస్థ జ్ఞాన ప్రబోధిని సహకారముతో నాయకత్వ లక్షణాలుమూర్తిమత్వ వికాసం అనే అంశముపై ప్రజా పాలన ప్రగతి పాలనలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జ్ఞాన ప్రబోధిని స్వచ్ఛంద సంస్థ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అమూల్ గాంగ్లి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఉన్నత స్థాయికి ఎదగాలంటే నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలని, ఇది వ్యక్తి మూర్తిమత్వ వికాసములో ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపినారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో నాయకత్వ లక్షణాలు వ్యక్తిత్వ వికాసం ఎంత ప్రధానమో వివరించినారు. జ్ఞాన ప్రబోధిని ఆధ్వర్యంలో నిర్వహించబడిన నాయకత్వ లక్షణాలు మూర్తిమత్వ వికాసం అనే సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమములో పాల్గొంటూ పై విధంగా తెలిపినారు. ప్రతి వ్యక్తి ఆధునిక కాలంలో ప్రత్యేక నైపుణ్యాలను కలిగి ఉంటేనే సమాజంలో రాణించగలుగుతారని, ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్ణయించుకుని వాటిని సాధించుటకు ప్రయత్నించాలని తెలిపినారు. క్యారీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ కరుణ మాట్లాడుతూ తమ కళాశాలలో నాయకత్వ లక్షణాలపై ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సును నిర్వహించడం జరిగిందని ఈ కోర్సు వ్యక్తి జీవితంలో ప్రధానమైనదని తెలిపినారు. విద్యార్థులు ఈ కోర్సులో నేర్చుకున్న విషయాలను ఆచరిస్తే సమాజములో ఉన్నత పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందని తెలిపినారు. కామర్స్ విభాగ అధిపతి జ్యోతి మాట్లాడుతూ నాయకత్వ లక్షణాల ఎందుకు తోడ్పడతాయి సమాజంలో వాటి ఉపయోగం ఏమిటో వివరంగా చర్చించినారు. ప్రతి వ్యక్తి ఉన్నతమైన లక్ష్యాలను నిర్ణయించుకొని వాటిని సాధించడానికి ప్రయత్నించాలని కోరినారు. అనంతరం సర్టిఫికెట్ కోర్సులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేయడం జరిగింది అదేవిధంగా కామర్స్ విభాగము ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ ఫైలింగ్ ఆఫ్ టాక్స్ రిటర్న్ అనే సర్టిఫికెట్ కోర్సు కు సంబంధించిన సర్టిఫికెట్లను బీ.కాం. విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగ అధిపతి జ్యోతి, క్యారియర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ కరుణ ఎన్.ఎస్.ఎస్. అధికారులు ఇతర అధ్యాపక బృందము తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణపై ద్వేషాన్ని వెళ్ళగక్కిన బిజేపీ యంపీ తేజస్వీ సూర్య దిష్టిబొమ్మను దహనం చేసిన కంటోన్మెంట్ కాంగ్రెస్ శ్రేణులు



**వాస్తవ తెలంగాణా డైలీ న్యూస్ /.** భారత రాజ్యాంగానికి లోబడి పార్లమెంటులో ఆమోదం పొంది ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును బిజెపి యంపీ తేజస్వీ సూర్య నిన్న పార్లమెంటులో మాట్లాడుతూ దేశ విభజనతో పోల్చి తెలంగాణ ప్రజల పట్ల తమ ద్వేషాన్ని బయట పెట్టుకుని, తెలంగాణపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పికెట్ లోని జెబియస్ చౌరస్తాలో కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తేజస్వీ సూర్య దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అవకాశం వచ్చినప్పుడల్లా బిజెపి పార్టీ తెలంగాణపై తన ద్వేషాన్ని బయటపెట్టుకుంటుందని గతంలో మోడీ కూడా తల్లి నుంచి బిడ్డను వేరు చేశారని మాట్లాడారని, నిన్న సందర్భం కాకపోయినా పార్లమెంటులో ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ పై నోరు పారేసుకున్నారని వెంటనే భేషరతుగా క్షమాపణ చెప్పాలని అతని పార్లమెంటు సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని లేకపోతే బిజెపి చేతిలో అవమానపడ్డ తెలంగాణ ప్రజల దెబ్బ ఎలా ఉంటుందో రుచి చూస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వైస్ చైర్మన్ లు కదీర్వన్, వేణుగోపాల్ రెడ్డి, ముప్పిడి మధుకర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నాగినేని సరిత ఉపాధ్యక్షులు బల్వంత్ రెడ్డి, శాంసన్ రాజు, సదానంద్, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవానీ,నాయకులు సంకి రవీందర్, సంతోష్ యాదవ్, ధనలక్ష్మి ,జమీల్, అరవింద్ , నరేష్, మహేష్, సత్యనారాయణ,వినోద్ తదితరులు పాల్గొన్నారు

# ఏమిటీ ఈ పక్షపాత ధోరణి... కీసర సర్కిల్ పాలనా యంత్రాంగం పై విమర్శలు..

**---- కొన్నిటి పై మాత్రమే డిమలేషన్....**

**---అంకిరెడ్డి పల్లి షెడ్డు పై చర్యలు లేవేందుకు....**


**-- పలు ప్రింట్, ఎలక్ట్రిక్ మీడియాల్లోనీ విమర్శలను బేఖాతరు..**

**కీసర మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్లోని అంకిరెడ్డిపల్లి పరిధిలో అనుమతులు లేని భారీ షెడ్డు నిర్మాణం జరుగుతున్న తరుణంలో పలు పత్రికల్లో శాటిలైట్ ఛానల్లో ప్రసార మాధ్యమాల్లో అట్టి షెడ్ పై ఫిర్యాదులు విమర్శలు వెలువెత్తిన అనాథరైజ్డ్ భారీ షెడ్డు నిర్మాణం పై ఎలాంటి చట్టరీత్యా చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తుండడంతో అక్రమ షెడ్డు నిర్మాణం పూర్తయింది. ఇటీవల కీసర సర్కిల్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ పరిధిలో కొన్ని అనాథరైజ్డ్ షెడ్ల నిర్మాణాలని టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆధ్వర్యంలో డేమాలేషన్ చేసిన కీసర సర్కిల్ అధికార యంత్రాంగం అంకిరెడ్డిపల్లి లో ఉన్న భారీ షెడ్ పై మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం కీసర సర్కిల్ ప్రజల్లో పలు అనుమానాలకు తావిస్తోంది. మామూళ్ళు ముట్టాయన లేదా అధికార, రాజకీయ నాయకులకు ప్రలోభ పడి ప్రభుత్వం యంత్రాంగం తలవంచిందనా.. ఇలా పలు రకాల ఊహాగానాలకు తావిస్తున్నాయి. అంకిరెడ్డిపల్లి షెడ్డు నిర్మాణం జరిగిన ల్యాండ్ నాలా కన్వెన్షన్ కూడా చేయకుండా అక్రమ షెడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. ఇటీవల నిర్దాక్షిణ్యంగా రేకుల షెడ్లను కూల్చిన కీసర టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఈ అంకిరెడ్డిపల్లి షెడ్డుపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పారదర్శకమైన పాలనను అందించాలని కీసర సర్కిల్ ప్రజలు కోరుతున్నారు. చట్టం అందరికీ సమానమే నాన్న అభిప్రాయం తీసుకురావాలని కీసర సర్కిల్ ప్రభుత్వ అధికార యంత్రాంగం ద్వారా ఆశిస్తున్నారు.

















# మాత శిశు ఆరోగ్య కేంద్రంలో అగ్నిమాపక అవగాహన సదస్సు అగ్నిమాపక అధికారి కె. వెంకటేష్



**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి ఆంజనేయులు** మెదక్ పట్టణంలోని పిల్లి కొటాల్ లో గల మాతృ శిశు ఆరోగ్య కేంద్రం వద్ద ఫైర్ సర్వీస్ వీక్ 2026 సందర్భంగా ఫైర్ అగ్నిమాపక అవగాహన కార్యక్రమం మాతృ శిశు ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫైర్ స్టేషన్ అధికారి కే.వెంకటేష్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సులు,వార్డుబాయ్స్, సెక్యూరిటీ సిబ్బందికి అగ్ని ప్రమాదాల సమయంలో రోగుల భద్రతపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను సురక్షితంగా తరలించే విధానాన్ని ప్రదర్శించారు. జిల్లా ఫైర్ అధికారి జి.వేణు సూచనల మేరకు,స్టేషన్ ఫైర్ అధికారి కె.వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంశ్రీ చేయడం జరిగింది.





# ఓటింగ్‌కు.. సర్వం సిద్ధం!

మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, లోక్‌సభ సీట్ల పెంపు బిల్లులపై పార్లమెంటు భేటీలో రెండో రోజైన శుక్రవారం ప్రతిపక్షాల నిరసనల నడుమ చర్చ ప్రారంభమైంది. ప్రభుత్వం తీరుపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. సభలో చర్చ జరుగుతుండగా మహిళా రిజర్వేషన్‌పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఆక్షేపించాయి. సభలో ఇండియా కూటమి పార్టీలు ఈ మూడు బిల్లులను వ్యతిరేకించాయి. ఇప్పటికే ఆమోద ముద్ర పడిన మహిళా బిల్లును వెంటనే అమలు చేయాలని మండిపడ్డాయి. డీలిమిటేషన్ బిల్లుతో సౌత్, నార్త్ మధ్య వివాదాలు వచ్చే అవకాశం ఉందంటూ సభ దృష్టికి తెచ్చాయి. సభలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. చర్చ ముగియడంతో మరికాసేపట్లో ఈ మూడు బిల్లులపై స్పీకర్ ఓటింగ్ నిర్వహించనున్నారు.

వాస్తవ తెలంగాణ:

## మూడు బిల్లులపై ముగిసిన చర్చ

- లోక్‌సభలో ఇరుపక్షాల వాగ్వాదం
- వ్యతిరేకిస్తూ విపక్ష నేతల ప్రసంగాలు
- మహిళా బిల్లుకు ఓకే చెప్పిన టీడీపీ, వైసీపీ
- అమిత్ షాకు చురకలంటించిన ప్రియాంకా గాంధీ
- ఎన్నికల సమయంలో బిల్లులా.. ప్రశ్నించిన రాహుల్
- డీలిమిటేషన్ బిల్లుకు ఒప్పుకోని ఇండియా కూటమి
- ఈ సాయంత్రం ఐదు గంటలకు ఓటింగ్

### అమిత్ షాకు ప్రియాంకా కౌంటర్లు ..



వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ పార్లమెంటులో తన ప్రసంగంతో ఆకట్టుకున్నారు. శుక్రవారం 21 నిమిషాల పాటు సాగిన ఆమె ప్రసంగంలో వాగ్ధాటి, వ్యంగ్యం, రాజకీయ చతురత కనిపించాయి. అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేలా చమత్కారాలు విసురుతూనే, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను సైతం నవ్వించి తనదైన ముద్ర కనబరిచారు. మహిళా రిజర్వేషన్లపై జరిగిన చర్చలో ప్రియాంక మాట్లాడుతూ.. తరచూ బీజేపీ విమర్శించే నెహ్రూ ప్రస్తావనను తెలివిగా వాడుకున్నారు. 'మహిళా హక్కులకు పునాది వేసింది నెహ్రూ అనే వ్యక్తి. కంగారుపడకండి.. మీరు భయపడే జవహర్ లాల్ నెహ్రూ గురించి నేను చెప్పడం లేదు, ఇది చరిత్ర' అంటూ మోతీలాల్ నెహ్రూ రిపోర్ట్‌ను ప్రస్తావించారు. 1928లోనే మహిళలకు సమాన హక్కుల ప్రతిపాదన జరిగిందని, 1931లో సర్దార్ పటేల్ అధ్యక్షతన కరాచీ సెషన్‌లో తీర్మానం నెగ్గిందని ప్రియాంక గుర్తుచేశారు. ప్రసంగం మధ్యలో హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. 'మీ వ్యూహాలు, ప్రణాళికలు చూస్తుంటే, ఒకవేళ ఈ రోజు చాణక్యుడు బతికి ఉంటే ఆయనే షాక్‌కు గురయ్యేవారు' అని ప్రియాంక అనగానే, అమిత్ షా గట్టిగా నవ్వడం అందరి దృష్టిని ఆకర్షించింది. అదే సమయంలో, మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై ప్రియాంక తీవ్రంగా విరుచుకుపడ్డారు. డీలిమిటేషన్ పేరుతో ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఈ బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదిస్తే దేశంలో ప్రజాస్వామ్యమే మిగలదని ఆందోళన వ్యక్తం చేశారు. 21 నిమిషాలు పాటు ప్రియాంక చేసిన ప్రసంగం లోక్ సభ్యులను ఆకట్టుకుంది. ఇక ప్రసంగం ముగిసే సమయానికి సభలోకి వచ్చిన సోదరుడు రాహుల్ గాంధీ, ప్రియాంకను అభినందిస్తూ 'ఇదే వేగాన్ని కొనసాగించు' అని ప్రోత్సహించారు.

### ప్రత్యేక హోదా ఏదీ? : ఎంపీ మిథున్ రెడ్డి



విభజన సమయంలో ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని అన్నారు కానీ ఇవ్వలేదని వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి లోక్‌సభలో అన్నారు. చట్టంలో లేదని ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం సరి కాదని ఆయన అన్నారు. ప్రతిపక్షాలను అణగదొక్కే సాధనంగా డీలిమిటేషన్‌ను వాడొద్దని కోరారు. ఇదే సమయంలోమహిళా రిజర్వేషన్ బిల్లుకు వైసిపి తరుపున ఆయన మద్దతు ప్రకటించారు.

### రెండు బిల్లులకు లింకేమిటి : శశిథరూర్



కేంద్రం చర్యలపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మండిపడ్డారు. ఇది పొలిటికల్ డీమోనెటైజేషన్ అని అన్నారు. డీలిమిటేషన్‌కు మహిళా రిజర్వేషన్ బిల్లు బందీగా మారిందని అన్నారు. ఈ వ్యవహారాన్ని డీలిమిటేషన్‌తో లంకె పెట్టకూడదని అన్నారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల తక్కువ ఎంపీ సీట్లు ఉన్న రాష్ట్రాలు నష్టపోతాయనీ, ఎక్కువ సీట్లు ఉన్న రాష్ట్రాలు లాభపడతాయని శశిథరూర్ లోక్‌సభలో తెలిపారు.

### అమిత్ షాపై కనిమొళి ఫైర్



ఈ బిల్లులు తీసుకొచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం తీరుపై డీఎమ్‌కే ఎంపీ కనిమొళి మండిపడ్డారు. హోం మంత్రి అమిత్ షా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని అన్నారు. రోజుల వ్యవధిలో బిల్లులు ఆమోదింపచేసుకోవాలనే ప్రయత్నంలో రాజకీయ లెక్కలు కనిపిస్తున్నాయని అన్నారు. ఇది అసలైన సమాఖ్య స్ఫూర్తి కాదన్నారు. రాష్ట్రాల హక్కులను ఈ ప్రభుత్వం గుర్తించట్లేదన్నారు. ఢిల్లీ సార్ల కోసమే రాష్ట్రాలు ఉన్నట్టు కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు.

### బిల్లులపై తొందరెందుకు : రాహుల్ గాంధీ



ఈ బిల్లుల ఆమోదానికి కేంద్రం ఎందుకు తొందరపడుతుందని లోక్ సభ విపక్ష నేత రాహుల్ గాంధీ నిలదీశారు.. ఇప్పటికే ఆమోదించిన మహిళ బిల్లు ఆమోదించలేక మళ్లీ ఆదే బిల్లును ఎందుకు టేబుల్ పై ఉంచారని ప్రశ్నించారు.. ఎన్నికల జరుగుతున్న నేపథ్యంలో కేంద్రం లబ్ధికోసమే ఈ బిల్లులను ప్రవేశ పెట్టిందని దుయ్యబట్టారు.. వాటిపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. డీలిమిటేషన్ వల్ల చాలా రాష్ట్రాలు నష్టపోతున్నామని అంటున్నాయనే విషయం ఆయన ఇక్కడ ప్రస్తావించారు.. రాష్ట్రాల వాదనను వినకుండా ఈ బిల్లుపై ముందుకు వెళ్లవద్దని గట్టిగా కోరారు..

## మహిళా బిల్లును అడ్డుకునేందుకే నాటకం

- ఎంపీ తేజస్వీ వ్యాఖ్యలకు బండి సంజయ్ సమర్థన
- తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించింది రేవంత్ రెడ్డే
- 1400 మంది బలిదానాలకు కాంగ్రెస్ కారణం



**వాస్తవ తెలంగాణ** : రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మ బలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని, ఇందులో తప్పేముందని అన్నారు కేంద్ర మంత్రి బండి సంజయ్. ఢిల్లీలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు తప్పుబడుతున్నారంటూ ఫైర్ అయ్యారు . 2009లో కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు సహకరించి మళ్లీ వెన్నక్కి తగ్గారని.. దీని గురించే తేజస్వి సూర్య మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో సోనియాగాంధీని బలిదేవత అన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. కరీంనగర్‌లో రణభేరి కార్యక్రమానికి రేవంత్ రెడ్డి తుపాకీ పట్టుకొని వెళ్లారని కేంద్ర మంత్రి తెలిపారు. 1400 మంది బలిదానాలకు హత్యలకు కారణమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. ఒక్క ఓటు, రెండు రాష్ట్రాలు అనే నినాదానికి కట్టుబడి, రాష్ట్ర విభజనకు మద్దతు ఇచ్చింది బీజేపీ అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కావాలని అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు.

## అడ్డుకుంటే చరిత్ర హీనులే

- కాంగ్రెస్‌కు కిషన్ రెడ్డి వార్నింగ్
- ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడంలో విపక్షాలు
- మహిళా వ్యతిరేక పార్టీలుగా కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్



**వాస్తవ తెలంగాణ** మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని విమర్శించారు. న్యూ ఢిల్లీలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు. 'దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకు నరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారు' అని అన్నారు.

# నాగారం డివిజన్ రాంపల్లి పరిధిలో రియల్ఎస్టేట్ మోసం కేస్ నమోదు...

## నిందితుల అరెస్టు.. మిగతా వారికోసం గాలింపు...



**కీసర మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో రాంపల్లి గ్రామం, దయానంద నగర్ ఆఫీసర్స్ కాలనీలో ఉన్న ప్లాట్ నెం. 235 (సర్వే నంబర్లు 263/పార్ట్ & 264, విస్తీర్ణం 200 చదరపు గజాలు) పై ఒక పెద్ద స్థాయి రియల్ ఎస్టేట్ మోసం కేసు నమోదు చేయబడింది. అట్టి ప్లాట్ కి అసలైన ఓనర్ గంగాధర వీరయ్య కాగా అతను ఆమె కూతురు లీలావతి కి గిఫ్ట్ డీడ్ ఇచ్చినాడు. కానీ వీరయ్య తన ఒరిజినల్ డాక్యుమెంట్ పోగొట్టుకొని పోవడం తో, తుకారం గేటు పి యస్ లో పిర్యాదు చేశారు. తరువాత లీలావతి తేది: 29.03.2022నా గంగి మల్లేష్ కి అమ్మగా, ఆ స్థలంపై ఆయన కాంపౌండ్ వాల్ నిర్మించి తన ఆధీనంలో ఉంచుకున్నారు. కానీ గంగి మల్లేష్ ఆ ప్లాట్ కి సంబంధించి బెదిరింపు కాల్ రావడం తో గంగి మల్లేష్ కీసర పోలీస్ స్టేషన్ లొ పిర్యాదు చెయ్యగా, కేసు నమోదు అయినది. ఈ కేసులో తక్కువ సమయం లొ ఎక్కువ డబ్బులు సంపాదించాలని, ప్రధాన నిందితుడు నాంపల్లి ప్రభాకర్ రెడ్డి కి వీరయ్య యొక్క ఒరిజినల్ ప్లాట్ పేపర్ లు లభించడం తో, తన సహచరులతో గుడిబాటి రమేష్ రెడ్డి , తుమ్మల మధుకర్ రెడ్డి కలిసి అసలు యజమాని గంగాధర వీరయ్య కి బదులు మరో వ్యక్తిని నచ్చు రామస్వామి ని అసలైన ఓనర్ గా చూపించి, ఆ ప్లాట్ ని గుడిబాటి రమేష్ రెడ్డి , 2004 లో నకిలీ రిజిస్ట్రేషన్ చేయించినారు. అనంతరం ఆ నకిలీ పత్రాల ఆధారంగా పలువురికి భూమిని విక్రయిస్తూ డబ్బులు సంపాదించినారు. ఈ కేసులో నాంపల్లి ప్రభాకర్ రెడ్డి, గుడిబాటి రమేష్ రెడ్డి, తుమ్మల మధుకర్ రెడ్డి లను 17.04.2026 న అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరచడం జరిగింది. మిగతా నిందితులు పరారీలో ఉన్నారు. ఈ కేసు పై మరింత దర్యాప్తు కొనసాగుతోంది. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నారు.

**పోలీసులు ప్రజలకు హెచ్చరిక:**

భూమి కొనుగోలు చేసే ముందు అసలు పత్రాలను పూర్తిగా పరిశీలించాలి

పాత రిజిస్ట్రేషన్లు, యజమాని వివరాలు ధృవీకరించాలి

డూప్లికేట్ లేదా అనుమానాస్పద డాక్యుమెంట్లపై జాగ్రత్తగా ఉండాలి

అనుమానాస్పద లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి అని ఆర్కపల్లి ఆంజనేయులు ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ కీసర పి యస్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మహనీయుల విగ్రహాల తొలగింపు. న్యాయం పోరాటం చేసి దళితుల పక్షాన నిలబడ్డా శ్రీదేవి యాదవ్



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం పెద్ద చర్లపల్లి చౌరస్తాలో నిన్న విగ్రహాలను తొలగించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దళిత సంఘాలతో కలిసి కార్యక్రమాన్ని చేపట్టి న్యాయం సాధించిన నాయకురాలు బొంతు శ్రీదేవి యాదవ్ ఈ ఘటనపై వెంటనే స్పందించిన బొంతు శ్రీదేవి యాదవ్ , ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ సమస్యను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. బొంతు రామ్మోహన్ బొంతు శ్రీదేవి యాదవ్ చొరవతో ఈ విషయం ప్రభుత్వ పెద్దలు మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో చర్చలు జరిపేలా చేశారు. ఈ రోజు మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ని కలిసి వినతి పత్రం అందించారు. విగ్రహాలను తిరిగి అప్పగించాలని బలంగా కోరగా, కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ సాయంత్రం వరకు విగ్రహాలు విడుదల అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఆనందోత్వంలో డా అంబేద్కర్ చిత్రపటానికి సబ్బండ వర్గాల నాయకుల తో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ.."గ్రామ ప్రజలు, దళిత వర్గాలు, సబ్బండ వర్గాలు స్థానిక నాయకులందరితో కలిసి చేసిన ఈ పోరాటం వల్లే ఈ విజయం సాధ్యమైంది" అని పేర్కొన్నారు. ఈ విజయంతో గ్రామ ప్రజలు, దళిత వర్గాలు, స్థానిక నాయకులు ఆనందం వ్యక్తం చేస్తూ, మహనీయుల విగ్రహాలను తిరిగి సాధించడంలో కీలక పాత్ర పోషించిన బొంతు శ్రీదేవి యాదవ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, అన్యాయానికి ఎదురు నిలిచి న్యాయం సాధించడంలో ముందుండే నాయకులుగా బొంతు రామ్మోహన్ బొంతు శ్రీదేవి యాదవ్ మరోసారి తమ అంకితభావాన్ని చాటుకున్నారు.

# టాటా కంపెనీ వారు ఏర్పాటుచేసిన స్టార్ బజార్, జుడియోను ప్రారంభించిన కే యం ప్రతాప్....




**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని, మాణిక్య నగర్, చింతల్ లో ప్రతాప్ ఎస్టేట్స్ భవనంలో,టాటా కంపెనీ వారు ఏర్పాటుచేసిన స్టార్ బజార్, జుడియోను వారి యొక్క ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్ . ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ,స్టార్ బజార్, జుడియోను మాణిక్య నగర్, చింతల్ లో ఏర్పాటు చేసినందుకు టాటా అండ్ టెస్కో ఎంటర్ప్రైజె వారినీ అభినందిస్తూ,శుభాకాంక్షలను తెలియజేశారు. స్టార్ బజార్,జుడియో షాపింగ్ మాల్ ను చింతల్ లో ఏర్పాటు చేయడం వల్ల చుట్టుపక్కల కాలనీల, బస్తీల ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. దీని సమీపంలో నివసించే ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా, అతి తక్కువ ధరలకే వినియోగదారులకు నాణ్యమైన




నిత్యవసరాలు లభించడంతోపాటు ట్రాఫిక్ అంతరాయం లేకుండా, సమయం కూడా వృధా కాకుండా పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.పి. విశాల్ గౌడ్, టాటా ట్రెంట్ బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ తుమ్మల సురేందర్, ప్రాజెక్ట్స్ మేనేజర్ సునీల్ కుమార్, వివిధ కాలనీల, బస్తీల, సంక్షేమ సంఘం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# మల్కాజ్గిరి ఫ్యామిలీ కోర్టుకు నూతన జడ్జిలు..

## --ప్రిన్సిపల్ జడ్జ్. రాచపూడి శ్రీదేవి అదనపు జడ్జ్ గా కె.ఉమాదేవి



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మల్కాజిగిరి ఫ్యామిలీ కోర్టులో కొత్తగా నియమితులైన న్యాయమూర్తులు బాధ్యతలు స్వీకరించారు. హానరబుల్ ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్ట్ జడ్జిగా రాచపూడి శ్రీదేవి, అదనపు ఫ్యామిలీ కోర్ట్ జడ్జిగా కె. ఉమాదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు జడ్జీలను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోర్టు వ్యవహారాలు సమర్థవంతంగా సాగేందుకు తాము సహకారం అందిస్తామని బార్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రత్తయ్య, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు హరికృష్ణ, మహిళా ఉపాధ్యక్షురాలు ప్రసన్న, సంయుక్త కార్యదర్శి రవి శంకర్, మహిళా సంయుక్త కార్యదర్శి జలజ, కోశాధికారి పుణ్యరాజు, లైబ్రరీ సెక్రటరీ సాయినాథ్ గౌడ్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా పవన్ కుమార్ బిఎన్, లేడీ రిప్రెజెంటేటివ్ సుజాత, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నవనీత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు బద్రీనాథ్, రాకేష్ ఎన్, నరేందర్, నరేష్, శోభా రాణి, విమల తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లు చరిత్రత్మకం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్



**అమీన్ పూర్ వాస్తవ తెలంగాణ: న్యూస్** ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంట్ లో ప్రవేశపెట్టే మహిళా బిల్లు చారిత్రాత్మక బిల్లు అని దశబ్దాలా కాలంగా ఉన్న సమస్య పరిష్కారం అయ్యి మహిళలకు విజయం లభించిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ పేర్కొన్నారు.బీజేపీ మహిళా మోర్చా నాయకులు సరస్వతి ఆధ్వర్యంలో మూడవసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గా ఎన్నికైన అదెల్లి రవీందర్ ను శాలువాలతో ఘనంగా సన్మానించిన స్వీట్ తినియంచారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ బీజేపీ లో కష్టపడి పనిచేసే వారిని పార్టీ గర్తించి తగిన విదంగా వారి సేవలు ఉపయోగించుకుంటుందని బీజేపీ లో మాత్రమే కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈసందర్భంగా ప్రధాని మోడీ మహిళా బిల్లు33% ప్రవేశపెట్టి మహిళలకు రాజ్యాధికారం ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమని దశబ్దాల కాలంగా ఎదురుచూస్తున్నా మహిళా బిల్లు మోడీ హయాంలో విజయవంతం అవుతుందని తెలిపారు.ఈకార్యక్రమంలో మహిళమోర్చ నాయకురాళ్లు సరస్వతి రాంచద్రపురం పట్టణ ప్రధాన కార్యదర్శి పద్మ అనూష శాంతి రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.



# భారతి నగర్ డివిజన్ లో అభివృద్ధికి సహకరించండి-మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి



**రామచంద్రపురం వాస్తవ తెలంగాణ: న్యూస్** భారతినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ను కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతినగర్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ను కోరినట్లు తెలిపారు. అలాగే బాంబే కాలనీ కమ్యూనిటీ హాల్‌కు ధరను నిర్ణయించాలని, ఎంఎంటీఎస్ నుంచి అన్నమయ్య ఎన్‌క్లేవ్ వరకు బీటీ రోడ్‌కు బడ్జెట్ కేటాయించాలని కూడా కమిషనర్ ను కోరారు. అలాగే భారతినగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న ఎవీఔూదీ పనులను త్వరితగతిన ప్రాసెస్ చేసి ఎవీఔూదీ కు పంపించాలని కూడా కమిషనర్ ను కోరారు. అదేవిధంగా ఓల్డ్ ఎంఐజీ కాలనీలో స్పోర్ట్స్ ఫైల్‌కు బడ్జెట్ కేటాయించి టెండర్ ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని కూడా విజ్ఞప్తి చేశారు. అలాగే ఇప్పటికే కొనసాగుతున్న పనులను కాంట్రాక్టర్లు మరింత వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కూడా కోరారు. ఈ అంశాలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారు.

# ప్రతిభా ప్రదర్శన వేదికగా 'సాధన-2026'






**పటాన్ చెరు వాస్తవ తెలంగాణ: న్యూస్** లలిత, ప్రదర్శన కళల విభాగం విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించే 'సాధన-2026'ను శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం డ్యాన్స్ స్టూడియోలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ హ్యుమాని టీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని లలిత, ప్రదర్శన కళల విభాగం అధ్యాపకులు కర్ణాటక సంగీతం, భరతనాట్యం, కూచిపూడి, థియేటర్, లలిత కళలలోని మైనర్, ఓపెన్ ఎలెక్టివ్ కోర్సులలో చేరిన విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. సెమిస్టర్ చివరి ప్రాక్టికల్ పరీక్షలలో భాగంగా, విద్యార్థులు తమ అభ్యాసాన్ని, కళాత్మక ఎదుగుదలను ప్రతిబింబించేలా ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, కూచిపూడి, భరతనాట్యం, థియేటర్ ఆర్ట్స్ విభాగాల నుంచి పాల్గొన్నవారు తమ అకడమిక్ మూల్యాంకనంలో భాగంగా అద్భుతమైన వేదిక ప్రదర్శనలు ఇచ్చారు.కూచిపూడి విభాగానికి డాక్టర్ వై.లలిత సింధూరి, వైష్ణవి ప్రతివాది మార్గదర్శకత్వం వహించగా, భరతనాట్యం ప్రదర్శనలకు అంజు అరవింద్ మార్గదర్శకత్వం వహించారు. నాటక కళల ప్రదర్శనలకు డాక్టర్ శ్యామ్ ప్రకాష్ నాయకత్వం వహించగా, కర్ణాటక సంగీత విద్యార్థులకు మృదురవళి దర్భ మార్గదర్శకత్వంలో శిక్షణ ఇచ్చారు. మృదంగంపై చంద్రకాంత్, వయోలిన్ పై వాసు అందించిన ప్రత్యక్ష సంగీత సహకారంతో

ఈ ప్రదర్శనలు మరింత సుసంపన్నమయ్యాయి. ఈ కార్యక్రమానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ప్రతి ప్రదర్శన దాని కళాత్మక నైపుణ్యానికి, భావ గాఢతకు విస్తృత ప్రశంసలను అందుకుంది.

# సంగారెడ్డి--అందోల్ సమస్యలపై కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్





**సంగారెడ్డి వాస్తవ తెలంగాణ: న్యూస్** సంగారెడ్డి ,అందోల్ నియోజకవర్గాలకు సంబంధించిన పలు కీలక సమస్యలపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ , అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ కలిసి వినతిపత్రం సమర్పించారు.ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నియోజకవర్గంలోని పలు పెండింగ్ పనుల వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దాని పరిష్కారానికి వెంటనే ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు.వెంటనే స్పందించిన కలెక్టర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తామని మీూా కి తెలిపారు.అలాగే నియోజకవర్గంలో కొనసాగుతున్న పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఇద్దరు నేతలు ప్రజా సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరిత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.

# 12వ వార్డులో తాగునీటి సమస్యకు పరిష్కారం

## రెండు బోరుబావులను ఏర్పాటు చేసిన కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు



**సదాశివపేట వాస్తవ తెలంగాణ: న్యూస్** సదాశివపేట పట్టణంలోని 12వ వార్డులో ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండడానికి, వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో స్థానిక ప్రజల ఇబ్బందులు పడద్దని, వెంటనే స్పందించి వార్డులో నూతనంగా రెండు కొత్త బోరుబావులను వేయించారు. ఈ బోరుబావి ఏర్పాటు ద్వారా వార్డు ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందుబాటులోకి రావడం జరుగుతుందని దీనితో వార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇది ఒక పెద్ద ఉపశమనంగా మారిందన్నారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ ,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు పాల్గొని బోరుమోటారుకు భూమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి బోరుమోటారును స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్లు ప్రసాద్, గణేష్, వార్డు ప్రజలు కర్ణం నరసింహాచారి, మన్నె విజయ్ యాదవ్, మన్నె మనోహర్, నల్ల అంజమ్మ, నీలి మల్లమ్మ, మాదాసు నరేష్, మడుపతి కిరణ్, పి. ఎం. ఆర్ యువసేన నాయకులు రాగం అనిల్, గుణాకర్, అంజి గౌడ్, తాలెల్మ రాము, అఖిల్, సోమ శంకర్, మొదలగువారు పాల్గొన్నారు.

